తప్పని తిప్పలు


లో-లెవల్ వంతెనపై వరద ప్రవాహం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల – గోనెపల్లి గ్రామాల మధ్య వాగుపై లో–లెవల్ వంతెనతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. వరద ఉధృతి కారణంగా రెండు గ్రామాల ప్రజలకు ఎన్నో యేళ్లుగా తిప్పలు తప్పడం లేదు.


హై-లెవల్ వంతెన కోసం వేసిన శిలాఫలకం

లో–లెవల్ వంతెన స్థానంలో హై–లెవల్ వంతెనతోపాటు గోనెపల్లి వరకు మూడు కిలో మీటర్లు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.14.45 కోట్లు మంజూరు చేయగా, గత ఏడాది అక్టోబర్‌లో అప్పటి మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు హై లెవల్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో రెండు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వానకాలంలో రామునిపట్ల–గోనెపల్లి గ్రామాల మధ్య వాగు ఉధృతి కారణంగా రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల కురిసిన వర్షానికి రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రైతులు సైతం వ్యవసాయ పనులకు వెళ్లలేక వరద ఉధృతి తగ్గేవరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌ను అడగగా వంతెన నిర్మాణ పనులు త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

- హై-లెవల్ వంతెన కోసం ఎదురుచూపు
- శిలాఫలకానికే పరిమితం
- యేడాది కావస్తున్నా ప్రారంభం కాని పనులు

నిర్మాణం పూర్తి చేయాలి



గోనెపల్లి– రామునిపట్ల గ్రామాల మధ్య వాగుపై ఉన్న లో–లెవల్ వంతెన స్థానంలో హై–లెవల్ వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేసి రెండు గ్రామాల ప్రజల ఇబ్బందులు తీర్చాలి. గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి శంకుస్థాపనచేసి యేడాది కావస్తున్నా పనులు ప్రారంభించలే.

– బత్తుల మల్లేశం, గోనెపల్లి

తరగతి గదే దేశ భవిష్యత్‌కు పునాది

– రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్


భోజనాన్ని పరిశీలిస్తున్న వెంకటయ్య

దౌల్తాబాద్ (దుబ్బాక): దేశ భవిష్యత్‌కు పునాది పడేది తరగతిగదిలోనే అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మండలంలోని లింగరాజ్‌పల్లిలోని మహాత్మ జ్యోతిబాపూలే బాయ్స్ హాస్టల్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు ఉంటే ప్రిన్సిపాల్, యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యుత్ సమస్య గురించి సంబంధిత అధికారితో మాట్లాడారు. టాయిలెట్లు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, ఎండీ రహీమొద్దీన్, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు దేవేందర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటరెడ్డి, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వద్దు జూట్ బ్యాగులను వాడదాం

– మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


హుస్నాబాద్: మార్కెట్ వద్ద శుభ్రం చేస్తున్న రజిత

హుస్నాబాద్/సిద్దిపేటకమాన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: ప్రజలు మార్కెట్‌కు వచ్చినప్పుడు ప్లాస్టిక్ బదులు జూట్ బ్యాగులను వినియోగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం కూరగాయల మార్కెట్‌లో చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15రోజులపాటు నిర్వహించే ఈ సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కో ఆప్షన్ సభ్యుడు శంకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం, శంకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శోభాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చెత్తా చెదారాన్ని తొలగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కర్ణాకర్, అధ్యాపకులు రవీందర్, సదానందం, నిర్మలదేవి, లక్ష్మయ్య, సంపత్, కవిత తదితరులు ఉన్నారు. పోలీసు స్టేషన్‌లో నాటిన ప్రతి మొక్కను సిబ్బంది సంరక్షించాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కోరారు. పీఎస్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్‌గౌడ్, సదాశివరావు, సత్యంగౌడ్, ఆంజనేయులు, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ప్రశాంత్‌నగర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, మున్సిపల్ సిబ్బంది, జవాన్లు భాను, శివ, మల్లేశం, రాజు, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ పరిధిలో మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి ప్రతిజ్ఞ చేయించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కమిషనర్ నర్సయ్య, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

– సీడీపీఓ సరిత


జగదేవ్‌పూర్(గజ్వేల్): మాట్లాడుతున్న సరిత

జగదేవ్‌పూర్(గజ్వేల్)/గజ్వేల్‌రూరల్: పోషకాహారాలను తీసుకుంటేనే తల్లులు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ సరిత అన్నారు. పోషణ మాసంలో భాగంగా మండలంలోని తిగుల్ గ్రామంలో శనివారం పోషణ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, పిల్లలు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి అఖిల, సూపర్ వైజర్ రజిత, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్‌రూరల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం 1లో శనివారం పోషణ మాసం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ విజయ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సుకన్య, మమత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

– జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ


మాట్లాడుతున్న శశిధర్‌శర్మ

వర్గల్(గజ్వేల్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అదరాసుపల్లి శశిధర్‌శర్మ అన్నారు. వర్గల్‌లో శనివారం మండల నూతన కార్యవర్గ ఎన్నికను పురస్కరించుకుని పూర్వ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ నిర్ణయం హర్షణీయమన్నారు. వర్గల్ మండల పీఆర్‌టీయూ కార్యవర్గం ఏకగ్రీవమైంది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, వేమారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా మెడికల్ కళాశాల ఫెస్ట్

– కాంగ్రెస్ నేత భాస్కర్


బహుమతులు అందజేస్తున్న విమలాథామస్

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ మెడికల్ కళాశాల వార్షికోత్సవాన్ని వైద్య విద్యార్థులు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 2020బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు డ్రావెన్ కోర్సు 'ఉద్భవ్' పేరుతో కళాశాల ఫెస్ట్ చేపట్టారు. 13న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య విద్యార్థులు రంగోలీ, పాటలు, క్రీడా పోటీలు, యాక్టింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు డ్యాన్స్‌లు, పాటలు, వివిధ రకాల ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. వారం రోజులుగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలాథామస్ బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సురేశ్‌బాబు, చందర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి క్షమాపణ చెప్పాలి

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై చేసిన అనుచిత వాఖ్యలకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సనాధి భాస్కర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మండల నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, చెరుకు రమణారెడ్డితో కలసి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింహులు, భిక్షపతి, కనుకరాజు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

– ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి


కొండపాక(గజ్వేల్): విజేతలకు బహుమతి అందజేస్తున్న యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్)/సిద్దిపేటరూరల్/మద్దూరు (హుస్నాబాద్)/తొగుట(దుబ్బాక): శారీరక, మానసిక ఉల్లాసాలకు క్రీడలు దోహదపడుతాయని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు శనివారం రాత్రి ముగిశాయి. క్రీడల నిర్వహణకు సహకరించిన దాత పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు పాల్కంపల్లి నరేందర్, లయన్స్ క్లబ్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ బయటకు తీసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, హెచ్ఎం సత్తయ్య, పీఈటీలు రాజ్‌కుమార్, ఉప్పలయ్య, అశోక్, బాబు పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడల్లోను రాణించాలని ఎంఈఓ యాదవరెడ్డి సూచించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ క్రీడలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు ఓటములను బేరీజు వేసుకుని భవిష్యత్‌లో మరింత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు, సతీశ్, వివిధ పాఠశాలల పీఈటీలు సరస్వతి, రజిత, మహేశ్, వెంకటేశ్, నవీన్ పాల్గొన్నారు. మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. పీడీ ప్రేమ్‌కుమార్ ఉన్నారు. గొగుట గుడికందుల పాఠశాలను ఎంఈవో యాదవరెడ్డి సందర్శించి విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం అంజిరెడ్డి, నాగిరెడ్డి, శివయ్య, భాస్కర్‌రెడ్డి, అనసూయ, కనక రాములు, భిక్షపతి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నతంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

– డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి


ఉపాధ్యాయులతో డీఈఓ శ్రీనివాస రెడ్డి

సిద్దిపేటజోన్: ఏరంగంలోనైనా ఉత్తమ ఫలితాలు సాధించిన వారు ఉన్నత స్థాయికి చేరుకుంటారు. అలాంటి వారిని తీర్చిదిద్దిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక విపంచి ఆడిటోరియంలో సిద్దిపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల చిత్తశుద్ధి వల్లే సిద్దిపేట విద్యారంగంలో ముందంజలో ఉందన్నారు. జిల్లా పదోతరగతి ఫలితాల్లో మెరుగైన స్థానంలో ఉందని, కష్టపడి పనిచేసిన వారందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జోజి, కార్యదర్శి సురేశ్, ప్రతినిధులు అమర్నాథ్, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి


గజ్వేల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్/ములుగు(గజ్వేల్)/సిద్దిపేటకమాన్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు రాజారామ్ కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం గజ్వేల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్దార్‌ఖాన్, రాములుగౌడ్, శ్రీనివాస్, సత్యనారాయణ, లక్ష్మణ్, బలరాం, ప్రేమ్‌కుమార్, నాగరాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ బి.నీరజప్రభాకర్, అధికారులు, సిబ్బంది బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు భగవాన్, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, విజయ, శ్రీనివాసన్ పాల్గొన్నారు. సిద్దిపేటలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సతీశ్, స్వామి, సదానందం, రాజేశం, మల్లికార్జున్, భిక్షపతి, మల్లేశం, శ్రీనివాస్, రవితేజ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు జమ

– ఏటీఓ, ఎస్టీఓలకు మెమోలు జారీ

సాక్షి ఎఫెక్ట్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ఏటీఓ కార్యాలయంలో 'చెక్కులు మాయం' శీర్షిక గురువారం వచ్చిన కథనానికి జిల్లా ట్రెజరీ అధికారి బాలరాజు శనివారం స్పందించారు. మాయం అయిన చెక్కులను వెతికి కోహెడ మండలం రాంచంద్రాపూర్ పంచాయతీ కార్మికుల వేతనాలను జమచేశారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏటీఓ, ఎస్టీఓ, సీనియర్ అసిస్టెంట్‌కు మెమోలు జారీ చేసినట్లు డీటీఓ తెలిపారు. వీఆర్ఏల దగ్గర డబ్బులు తీసుకోవడం, పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఇబ్బందులు పెట్టడంపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

తల్లిదండ్రుల వద్దకు బాలుడు



సిద్దిపేటకమాన్: తల్లిదండ్రులతో బస్సులో ప్రయాణిస్తూ మార్గ మధ్యంలో దిగిపోయిన బాలుడిని పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన సిద్దిపేటలో శనివారం చోటు చేసుకుంది. కంట్రోల్ రూం ఇన్‌స్పెక్టర్ మల్లేశంగౌడ్ కథనం ప్రకారం.. ఉమా, పీటర్ తమ నాలుగేళ్ల కుమారుడు బెన్నర్‌తో కలిసి వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో శనివారం సిరిసిల్ల నుంచి సికింద్రాబాద్‌కు ప్రయాణించారు. సిద్దిపేట బస్టాండ్‌లో వాళ్ల బాలుడు పొరపాటున వేరే మహిళతో కిందకు దిగాడు. బస్టాండ్‌లో ఓ ఆటో డ్రైవర్ బాలుడిని గుర్తించి 100కు ఫోన్ చేసి విషయం తెలిపాడు. దీంతో కంట్రోల్ రూం సిబ్బంది బాబుతో పాటు దిగిన మహిళ వద్ద ఉన్న టికెట్ ఆధారంగా బాలుడిని వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

మర్యాదపూర్వక కలయిక



సిద్దిపేటజోన్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను జిల్లా ఓబీసీ కాంగ్రెస్ సెల్ చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలో ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని చెప్పినట్టు వర్మ తెలిపారు. ఆయన వెంట శ్రీనివాస్ గౌడ్, దిలీప్, చిరంజీవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్వోప్లాంట్ బహూకరణ


బ్యాగులతో విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): తాగునీటి కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న ఉద్యోగులు పాఠశాలకు ఆర్వో ప్లాంట్ అందజేసి దాతృత్వం చాటుకున్నారు. పాలమాకుల గ్రామానికి చెందిన ఎల్లంకి అమరేందర్ రెడ్డి హైదరాబాద్‌లోని రెడ్డీస్ ల్యాబొరేటరీలో సైంటిస్ట్‌గా పనిచేస్తుండగా అతడి భార్య ఉష సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. పాలమాకుల ఉన్నత పాఠశాల విద్యార్థులకు తాగునీటిని అందజేయాలనే ఉద్దేశంతో రూ.3లక్షల విలువచేసే ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. అలాగే 50మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రావు, హరికృష్ణ, సంజీవ్, మహబూబ్‌అలీ, రాములు, మురళీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు చరిత్ర చెరగదు


మాట్లాడుతున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ ప్రజలకు గోదావరి జలాలు అందించిన ఘనత కేసీఆర్, హరీశ్‌రావుదేనని మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్, నమూండ్ల రాంచంద్రం అన్నారు. శనివారం చిన్నకోడూరులో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు ఉత్తదేనని, అది కూలిపోయిందని నిందలు వేయడం సరికాదన్నారు. కాళేశ్వరం లేకుంటే మల్లన్న సాగర్‌లోకి, రంగనాయకసాగర్, అనంతగిరి ప్రాజెక్టులోకి నీళ్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కాళేశ్వరం చరిత్రను ఎవ్వరూ చెరపలేరన్నారు.

విద్యతోనే వివక్ష దూరం

కొముురవెల్లి(సిద్దిపేట): మహిళలపై వివక్ష పోవాలంటే వారు చదువుల్లో రాణించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు ఉన్నా దాడులు ఆగడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శిక్షణ తరగతుల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.రజినీకాంత్, రమ్య, మానస, అమూల్య, ప్రసూద, రక్షిత, అక్షిత, స్పందన, సుష్మ అంజలి, భరత్ పాల్గొన్నారు.

హద్దులు నిర్ణయించండి


వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని దౌలాపూర్‌లో తిరుమలాయ దేవాలయానికి సంబంధించిన భూమి అన్యాక్రాంతం కాకుండా హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం గ్రామ హనుమాన్ ట్రస్టు సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి మధుసూదన్‌రెడ్డి, నారాయణ, సుధాకర్‌రెడ్డ గజ్వేల్‌ఆర్డీఓ బన్సీలాల్, తహసీల్దార్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు స్పందించి భూమి చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

కల్యాణ తలంబ్రాల పంపిణీ


తలంబ్రాలను అందజేస్తున్న రామరాజు

దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటవార్డు ప్రజలకు శ్రీరామకోటి భక్తి సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు శనివారం భద్రాచల ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మాజీపేట ప్రజలు భద్రాచల రాముడి కల్యాణానికి గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాలను అందజేశారని, వారి భక్తి భావం అమోఘమన్నారు. వారి భక్తికి మెచ్చి దేవస్థానం ముత్యాల తలంబ్రాలను అందించారన్నారు. అనంతరం ఆయనను పలువురు గ్రామస్తులు సత్కరించారు.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీతోనే సామాజిక న్యాయం

చిన్నకోడూరు(సిద్దిపేట): సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్‌లో శనివారం పలువురు బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు విద్యాసాగర్, సంతోష్ కుమార్, బాలయ్య, నరేందర్ ఉన్నారు.

◆ వదంతులను నమ్మొద్దు: సీఐ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో సింహం సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. శనివారం రాత్రి పట్టణంలోని సంగాపూర్ రోడ్డు మార్గంలో పెట్రోల్ పంపు వద్ద పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, అలాంటి వీడియోలను షేర్ చేయవద్దని సూచించారు.

◆ పాఠశాల అభివృద్ధికి సహాయం



దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండలం చిట్టాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ పోతనక రాజయ్య రూ.20వేలు సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

◆ కాళేశ్వరంపై ఆరోపణలు తగదు

సిద్దిపేటజోన్: కాళేశ్వరంపై అసత్య ప్రచారాలు తగదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీల నీళ్లు ఉన్నాయని, ఇది మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల ప్రత్యేక ప్రణాళికలకు నిదర్శనమన్నారు. కాళేశ్వరం విఫలం అయితే మల్లన్నసాగర్‌లోకి నీరు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. సమావేశంలో సోమిరెడ్డి, సుందర్, మోహిజ్, పాపయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థినులకు నాప్‌కిన్స్ పంపిణీ

వర్గల్(గజ్వేల్): హైదరాబాద్ బేగంపేట సత్యసాయి సేవా సమితి ప్రతినిధి కేవీఎస్ సాయికుమార్, రాయపోల్ స్కూల్ టీచర్ తులసీదాసు సహకారంతో శనివారం వర్గల్ మండలం నెంటూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థినులకు రూ.45వేలు విలువైన రీయూజబుల్ శానిటరీ నాప్‌కిన్స్‌ను అందజేశారు. హెచ్ఎం కనకరాజు, గాంధీ ఆస్పత్రి డెర్మటాలజిస్టు డాక్టర్ నాగశృతి, ఉపాధ్యాయులు జ్యోతి పాల్గొన్నారు.

◆ ఆర్యవైశ్య అధ్యక్షుడిగా వెంకటయ్యగుప్త

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా బ్రాహ్మండ్లపల్లి వెంకటయ్యగుప్త ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శనివారం ఆర్యవైశ్య మహాసభ నాయకులు హరినాథ్‌గుప్త, రంగయ్య గుప్త పర్యవేక్షణలో వర్గల్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ సైదా సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, డ్రగ్స్, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, చదువుల్లో రాణించాలన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని, అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం శారద, షీటీమ్ సిబ్బంది శ్రీరాములు, శ్యామల, లావణ్య, మహేశ్, రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

◆ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు

హుస్నాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా నేరవేర్చలేదని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. పట్టణ శివారులోని పోతారం (ఎస్) శుభం గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం లేకపోవడం వల్లనే ఎన్నికల్లో దెబ్బతిన్నామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పరిస్థితి రావద్దన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హుస్నాబాద్‌పై ప్రేమ లేదన్నారు. ఓపిక లేని ఎమ్మెల్యే దొరకడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో శ్రీహరి, రామకృష్ణ, సుధీర్ కుమార్, రాజిరెడ్డి, రజిత, అనిత, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.